క్లుప్తంగా

నేడు మంత్రి రోజా బందరు రాక

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పర్యాటక యువజన సర్వీసులు, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా బుధవారం బందరు రానున్నారు. విజయవాడలోని ఆమె నివాసం నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 8.50 గంటలకు మచిలీపట్నంలోని జిల్లా పరిషత్‌కు చేరుకుంటారు. 9 గంటలకు జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో జరిగే మచిలీపట్నం నియోజకవర్గ సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

సచివాలయం తనిఖీ

పెడన: సచివాలయాల్లో సర్వీసు చార్జీల కింద వసూలు చేసే నగదు మీ వద్ద ఉంచుకోవద్దని, ఏ రోజుకారోజు హెడ్ ఆఫ్ ది అకౌంట్‌కు జమ చేయాలని వార్డు, గ్రామ సచివాలయాల డీఎల్‌డీఓ పద్మావతి అన్నారు. మంగళవారం ఆమె 9వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సుందరంతో మాట్లాడుతూ పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉంచాలని సూచించారు.

వ్యాన్ బోల్తా

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఒంటిల్లు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం వ్యాన్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంటుమిల్లి వైపు నుండి లక్ష్మీపురం వైపునకు రొయ్యల లోడుతో వెళుతున్న వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పైనే పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో నలుగురు వ్యక్తులు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ

గూడూరు: నూరు శాతం సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం తరకటూరులో నిర్వహించారు. ఆర్బీకే చైర్మన్ గళ్లా కేశవ ఆధ్వర్యంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పొలం గట్లపై కంది విత్తనాలు నాటారు. కేశవ మాట్లాడుతూ పొలం గట్లపై కంది సాగు చేపట్టడానికి ప్రభుత్వం నూరు శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తోందని చెప్పారు.

కేడీసీసీబీ డైరెక్టర్‌గా వెంకట కృష్ణారావు

గూడూరు: కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా తలుపుల వెంకట కృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తలుపుల వెంకట కృష్ణారావు ప్రస్తుతం గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. తన నియామకానికి ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి జోగి రమేష్‌కు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

చల్లపల్లి: 15వ ఆర్థిక సంఘం నిధులతో మంగళవారం స్థానిక బండ్రేవుకోడు మైనర్ డ్రెయినేజీ పక్కన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.4.40 లక్షలతో 86 మీటర్ల పొడవైన సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పూజలు చేసి ప్రారంభించారు. ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చేపల వేలం ద్వారా రూ. 2.63 లక్షల ఆదాయం

కోడూరు: కోడూరులోని మంచినీటి చెరువుల్లో చేపల పెంపకానికి సంబంధించి నిర్వహించిన వేలం ద్వారా పంచాయతీకి రూ.2.63 లక్షల ఆదాయం లభించిందని ఈఓపీఆర్డీ యలవర్తి నాగరేవతి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. కోడూరు సంతమార్కెట్ సమీపంలోని రామరాజు చెరువును రూ.1.50 లక్షలకు, ఇస్మాయిల్‌బేగ్‌పేట చెరువును రూ.77,500లకు, నరసింహపురం చెరువును రూ.35,500లకు వేలం ద్వారా పాటదారులు దక్కించుకున్నారని ఈఓపీఆర్డీ వివరించారు.

బీమా నగదు అందజేత

కోడూరు: కోడూరు గ్రామానికి చెందిన చెన్ను నరేంద్రబాబు ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ. 10 వేల బీమా నగదును సర్పంచ్ వెన్నా హైనీ అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లా సేవలు

- వలంటీర్ల సేవలపై ప్రశంసలు
- ప్రతిపక్షాల అనుచిత వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

మచిలీపట్నంటౌన్: నగరంలోని వలంటీర్లు వారివారి క్లస్టర్ల పరిధిలోని ప్రజలకు అందిస్తున్న సేవల ద్వారా సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేయించి లబ్ధిపొందేలా చూస్తున్నారు. ఈ విధంగా వలంటీర్లు కుటుంబ సభ్యుల్లా భాగస్వాములవుతున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనా ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించేందుకు సహకరిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారు. ఇలాంటి వ్యవస్థపై రాజకీయ దురుద్దేశంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ప్రతిపక్షాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పింఛనుదారు జమీరున్నీసాకు జగనన్న సురక్ష క్యాలెండర్ అందజేస్తున్న వలంటీర్ కీర్తి

వలంటీర్లకు వందనం

ప్రాణాలు కాపాడారు



మాది 36వ డివిజన్ పరిధిలోని ఆంధ్ర జాతీయ కళాశాల వెనుక ప్రాంతం. నాకు మార్చి మొదటి వారంలో టీబీ వ్యాధి ఉధృతమై ప్రాణాంతకమైంది. ఆ సమయంలో మా వలంటీర్ మట్టా స్వప్నకు ఫోన్ చేశా. ఆమె వెంటనే వచ్చి నన్ను సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడ మెరుగైన వైద్యం అందడంతో నేను బతికి బట్టకట్టాను. వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. – పి. ఉమామహేశ్వరరావు, బందరు

ఒకటో తేదీనే పింఛను ఇస్తున్నారు



నేను 36వ డివిజన్ పరిధిలోని చలపాటి లేఅవుట్‌లో చివరి ప్రాంతంలో గృహం నిర్మించుకుని జీవిస్తున్నా. ఏడాదిన్నర కిందట నా భర్త చనిపోవడంతో వితంతు పింఛను మంజూరైంది. పల్లపు లే అవుట్ కావడంతో వర్షం నీరు నిలిచిపోతోంది. పాములు తిరుగుతుంటాయి. ప్రతి నెలా తెల్లవారుజామున వలంటీర్ కొడాలి కీర్తి చీకట్లోనే మా ఇంటికి వచ్చి పింఛను సొమ్ము అందిస్తోంది. అలాగే నా దివ్యాంగ కుమార్తె హమీద్ కౌసర్‌కు పింఛను అందిస్తోంది. మా ఇద్దరికీ పింఛను ఇచ్చేందుకు వలంటీర్ కీర్తి సొంత మనిషిలా తెల్లవారుజామున వచ్చి ఇస్తోంది.

– జమీరున్నీసా, పింఛను లబ్ధిదారు

విజయవాడ ఆస్పత్రికి వచ్చి పింఛను ఇచ్చింది



నాకు గత మార్చి నెలలో గుండెపోటు రావడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాను. ఆ సమయంలో నాకు వచ్చే పింఛను సొమ్ము అందదేమో అనుకున్నా. ఒకటో తేదీనే మా వలంటీర్ ఆరేపల్లి రమాదేవి ఆస్పత్రిలోని నా బెడ్ వద్దకు వచ్చి పింఛను సొమ్ము ఇచ్చింది. ఆస్పత్రిలో ఉంటూ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న నాకు వలంటీర్ ఇచ్చిన పింఛను సొమ్ము ఎంతగానో ఉపయోగపడింది. వలంటీర్ మచిలీపట్నం నుంచి విజయవాడకు తన సొంత ఖర్చులతో వచ్చి పింఛను అందించి ధైర్యం చెప్పింది. పింఛను సొమ్ము ఇవ్వడమే కాకుండా ఏ సమస్య ఉన్నా తనకు చెబితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చింది. గుండెపోటుతో వైద్యం పొందుతున్న నాకు వలంటీర్ రమాదేవి చెప్పిన ధైర్యం మనోధైర్యాన్ని ఇచ్చింది. ఇలాంటి మంచి వ్యవస్థను అమలు చేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఈ వ్యవస్థపై ప్రతిపక్షాల విమర్శలు సరికాదు. – ముచ్చల సునీత, పింఛనుదారు

పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోసూరువారిపాలెం(మోపిదేవి): పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోసూరువారిపాలెంలో జగనన్న సురక్ష శిబిరం తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ఓర్వలేక వలంటీర్లలో మానసిక స్థైర్యం దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్రతో పవన్ కల్యాణ్‌తో ఆరోపణలు చేయిస్తున్నారని విమర్శించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడారు. అనంతరం 115 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు గరికిపాటి రేణుకయ్య పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: చేవేంద్ర గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. పెడన ఎంపీపీ రాజులపాటి వాణి లబ్ధిదారులకు 202 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మాజీ ఎంపీపీ అచ్యుతరావు, పార్టీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ ప్రకాశరావు, ఎంపీటీసీ అంకెం గిరి, సర్పంచ్ భాస్కరరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాము పాల్గొన్నారు.


కోసూరివారిపాలెంలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు

లక్ష్మీపురం, కొమాళ్లపూడిలో..

కృత్తివెన్ను: కొమాళ్లపూడి, లక్ష్మీపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్ మాట్లాడా రు. కొమాళ్లపూడిలో 157, లక్ష్మీపురంలో జెడ్పీటీసీ రత్నకుమారి లబ్ధిదారులకు 303 ధ్రువీకరణ పత్రాలను అందించారు.

ఎన్నికల ముందు చంద్రబాబు ప్లేటు మార్చేశారు

చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంకలా అయిపోతుందని ప్రచారం చేసిన చంద్రబాబు ఎన్నికల ముందు ప్లేటు మార్చేశారని, ఇప్పుడు జగన్ కంటే ఎక్కువ ఇస్తామని అంటున్నాడని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. మంగళవారం చల్లపల్లి గ్రామ సచివాలయం –4 వద్ద జగనన్న సురక్ష శిబిరం జరిగింది. 366 మంది లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం ద్వారా లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు సృష్టించే సంపద సంపన్నులతో పంచుకోవటానికే సరిపోతుందన్నారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీడీఓ సీహెచ్.చినరాట్నాలు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు.

అర్హులకు మేలు..

కోడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ మేలు జరుగుతోందని డీఎఫ్ఓ, మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం రామకృష్ణాపురం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 246 మందికి సర్టిఫికెట్లను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి చేతుల మీదుగా అందించారు. ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా పాల్గొన్నారు.

పేదలకు లబ్ధి

మచిలీపట్నంటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంతో నగరంలోని పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమ ప్రత్యేక శిబిరాలు మంగళవారం నగరంలోని 31వ డివిజన్ నుంచి 36వ డివిజన్ వరకు నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి మాట్లాడారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి

జేసీ అపరాజితసింగ్

పెడన: ప్రతి ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్న వారికి దారి లేదని స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలపై మంగళవారం ఆమె స్పందించారు. ఆమె స్వయంగా వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులు తమ సమస్యను జేసీకి విన్నవించారు. గేటు పక్కనే ఉన్న భవన యాజమాని రైల్వేట్రాక్ పక్కన షెట్టర్లు పెట్టడాన్ని ఆమె గుర్తించి ఆ విధంగా పెట్టడం నిబంధనలకు విరుద్ధం కదా అని ఆర్డీఓను ప్రశ్నించారు. ముడా వారి నుంచి అనుమతులు తీసుకువచ్చారని, అందువల్ల పురపాలక సంఘం అనుమతులు ఇచ్చిందని టీపీఓ ఏసుబాబు వివరణ ఇచ్చారు. దీనిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైల్వే రూల్స్‌కు వ్యతిరేకంగా ముడా వారు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. తక్షణం ముడా వారికి నోటీసులు ఇచ్చి రైల్వేట్రాక్ పక్కన షెట్టర్లు లేకుండా చూడాలని ఆర్డీఓను ఆదేశించారు. రోడ్డు విషయంలో పూర్వ రికార్డులు పరిశీలించిన తరువాత వాటిని బట్టి సర్వే చేయించి న్యాయం చేసేలా చూస్తానని స్థానికులకు ఆమె హామీ ఇచ్చారు.


స్థానికులతో మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

నాగకుమార్ అంత్యక్రియలు

మచిలీపట్నంటౌన్: కెనడాలోని వాటర్‌ఫాల్స్‌లో ఈత కొడుతూ ఇటీవల మృతి చెందిన పోలుకొండ లెనిన్ నాగకుమార్ (24) అంత్యక్రియలు మంగళవారం మచిలీపట్నంలో నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున కెనడాలోని సిల్వర్ ఫాల్స్‌లో స్నేహితులతో కలిసి వెళ్లి ఈత కొడుతూ మునిగిపోయి మృత్యువాత పడ్డాడు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కృషితో నాగకుమార్ మృతదేహం సోమవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా అక్కడి నుంచి అంబులెన్స్‌లో మచిలీపట్నం చింతగుంటపాలెంలోని అతని గృహానికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం నాగకుమార్ అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నాగకుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రాష్ట్ర ప్రగతి జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): ఏ గ్రామం వెళ్లినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం –1 పరిధిలోని చింతలమడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు గ్రామంలో 105 ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి, పేదల సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని గుర్తించిన పేదలు మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని వివరించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 46వ డివిజన్ రామ్‌నగర్ కాలనీలో రూ. 8.44 లక్షల సాధారణ నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏడో డివిజన్ చిలకలపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 2.12 లక్షలతో పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతికి పురస్కారం

గూడూరు: మల్లవోలుకు చెందిన హ్యూమన్ రైట్స్ ఏపీ జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి హైదరాబాద్‌కు చెందిన రితికా ఫౌండేషన్ నంది పురస్కారం అందుకున్నారు. ఈ నెల 16న హైదరాబాద్ బిర్లా మందిర్ సైన్స్ మ్యూజియంలో పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు రిత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ నంది పురస్కారాలు అందించారు. మంగళవారం మల్లవోలులో జరిగిన కార్యక్రమంలో ప్రశాంతిని పలువురు గ్రామ ప్రముఖులు అభినందించారు.

రైతులకు శిక్షణ

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలపై ఇస్తున్న పలు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి జె. జ్యోతి అన్నారు. దక్షిణ చిరువోలులంకలో మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం చేసే ఐదెకరాల రైతులకు 90 శాతం సబ్సిడీతో, 5 నుంచి 10 ఎకరాల రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నామన్నారు. కూరగాయల రైతులకు ఇచ్చే రాయితీలను ఆమె వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం చేసేలా పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకున్నారని పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు వన్నంశ్రీలత అన్నారు. మంగళవారం మంత్రి జోగి రమేష్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి చిరు వ్యాపారులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీలేని రుణాలు అందించేలా జగనన్న చర్యలు తీసుకున్నారని చెప్పారు. కృత్తివెన్ను ఎంపీటీసీ మైలారత్నకుమారి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మల్లి, సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్, రహమతున్నీసా, కమిషనర్ మహేంద్ర, టీఎంసీ భోగేశ్వరరావు, ఆర్పీలు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం వరం

పెడన: దివ్యాంగులకు భవిత కేంద్రం వరమని ఫిజియోథెరపిస్టు ఎంఎస్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంపీపీ పాఠశాల (బంగ్లా స్కూలు)లోని భవిత కేంద్రంలో శారీరక దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఎంఈఓ–2 వైవీ హరనాథ్, భవిత ఆర్పీ ఎంకే నీలాంబరం, స్కూల్ హెచ్ఎం జి. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలోని సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఆయన చాంబర్‌లో మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గ సమస్యలకు సంబంధించి బుధవారం జరగనున్న సమీక్షా సమావేశానికి ముందుగా స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే పేర్ని నాని నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జగనన్న ఇళ్లకు సంబంధించిన లే అవుట్లు, కాలనీలకు సంబంధించిన సమస్యలతో పాటు భూ సేకరణకు సంబంధించిన విషయాలను ఆయన అధికారులకు వివరించారు. పోర్టు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ అంశాలు, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణాలు చురుకుగా సాగేందుకు అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై చర్చించారు. లబ్ధిదారులు ఎంచుకున్న ఆప్షన్–3 కింద ప్రభుత్వమే కట్టించనున్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, ఆర్డీఓ ఐ. కిషోర్, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాధిక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజితసింగ్

ప్రభుత్వ బడులతో విద్యార్థులకు ఉజ్వల భవిత

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. కోడూరు జెడ్పీ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి అమ్మఒడి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చారని వివరించారు. కోడూరు విద్యా శాఖ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఇతర మండలాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొనియాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని రమేష్‌బాబు విమర్శించారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేసే స్థాయికి దిగజారాయని చెప్పారు. అనంతరం 3,347మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.5.02 కోట్ల నగదు చెక్కును విద్యార్థుల తల్లులకు అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి వీరవెంకట నారాయణ రావు, సర్పంచి వెన్నా హైనీ, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య పాల్గొన్నారు.


తల్లులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

గణనీయంగా తగ్గిన మాతృ మరణాలు

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

మోపిదేవి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను మచిలీపట్నం డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి ఆదేశించారు. మంగళవారం ఉదయం రావివారిపాలెంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆమె మాట్లాడారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, పేదల కోసం పీహెచ్‌సీలో 60 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు బాగా పనిచేయడం వల్లనే మాతృ మరణాలు తగ్గాయని చెప్పారు. డాక్టర్ ఎల్. లక్ష్మీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తొలుత స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

పెడన: పెడన పట్టణంతో పాటు మండలంలో ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ముడా వైస్ చైర్మన్, పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పెడన మండలంలోని బూత్‌లెవల్ సిబ్బందితో ఓటర్ల సర్వేపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సర్వే కార్యక్రమం ఈ నెల 21 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ సర్వేలో ఎటువంటి పొరపాట్లుకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పి. మధుసూదనరావు, డెప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: ఓటర్ల జాబితా రూపకల్పనపై గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పెడన నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాల పరిశీలన క్షేత్రస్థాయిలో నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే అలాంటివి గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, వివిధ గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.